క్లుప్తంగా

కనీస వేతన సలహా మండలి చైర్మన్‌కు సన్మానం



రఘునాథరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్: కనీస వేతన సలహా మండలి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన వి.రఘునాథ రెడ్డిని గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి సన్మానించారు. శుక్రవారం విజయవాడలో జరిగిన ప్రమాణస్వీకారోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే వైవీఆర్, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, పార్టీ నాయకుడు సిబి.జానకిరామిరెడ్డి రఘునాథరెడ్డిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

జగ్జీవన్‌రామ్ స్కూల్‌లో మరమ్మతులు చేయించండి



తరగతి గదులను పరిశీలిస్తున్న కమిషనర్

గుంతకల్లుటౌన్: పట్టణంలోని పోర్టర్స్‌లైన్ దగ్గర ఉన్న జగ్జీవన్‌రామ్ ఆది ఆంధ్ర మున్సిపల్ ప్రాథమిక పాఠశాల తరగతి గదుల పైకప్పుల నుంచి పెచ్చులూడి కిందపడకుండా వెంటనే మరమ్మతులు చేయించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఇంజినీర్లకు సూచించారు. పాఠశాల పైకప్పు పెచ్చులూడే ప్రమాదముందని 34వ వార్డు కౌన్సిలర్ సుమోబాషా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కమిషనర్ శుక్రవారం పాఠశాల భవనాన్ని పరిశీలించారు. మరమ్మతు పనులను వెంటనే చేయించి భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, పాఠశాలలో కనీస వసతులు కల్పించాలని ఆయన ఇంజనీర్లను ఆదేశించారు. డీఈ హేమచంద్ర, ఏఈ హరికృష్ణ పాల్గొన్నారు.

పంటలు జీపీఎస్ ద్వారా నమోదు చేయాలి



మాట్లాడుతున్న ఏడీఏ వెంకటరాముడు

గుత్తి: రైతులు సాగు చేసిన పంటలను జీపీఎస్ ద్వారా నమోదు చేయాలని ఏడీఏ వెంకటరాముడు సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని ఏడీఏ కార్యాలయంలో శుక్రవారం గుత్తి వ్యవసాయ డివిజన్‌లోని గుత్తి, పామిడి, శింగనమల, యాడికి, పెద్దవడుగూరు మండలాల వ్యవసాధికారులు, ఏఈఓలు, రైతు భరోసా సిబ్బందికి పంటల నమోదుపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ పంటల నమోదు పక్కాగా చేపట్టాలన్నారు. జీపీఎస్ ద్వారా పంట నమోదు చేస్తేనే రైతులకు పంట నష్ట పరిహారం, ఇన్సూరెన్స్ ఇతరత్రా సదుపాయలు అందుతాయన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్



స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లతో సెబ్ సిబ్బంది

తాడిపత్రి అర్బన్: సెబ్ అధికారులు, ఇంటెలిజెన్స్ అధికారులు సంయుక్తంగా జరిపిన దాడుల్లో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 6 ట్రాక్టర్లను సీజ్ చేశారు. సెబ్ అధికారి విజయ్‌కుమార్ తెలిపిన వివరాలు...తాడిపత్రి ప్రాంతంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారం అందుకున్న ఇంటెలిజెన్స్, సెబ్ అధికారులు శుక్రవారం తెల్లవారుజామున దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న 6 ట్రాక్టర్లు, టిప్పర్‌ను సీజ్ చేశారు. ఇసుక తరలిస్తున్న డ్రైవర్లు సుదర్శన్ రెడ్డి, మధుబాబు, నాగసుబ్బరాయుడు, నరేష్, పుష్పరాజు, నాగేంద్ర,కావలి శివప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని రూరల్ పోలీసులకు అప్పగించారు. దాడుల్లో సెబ్ ప్రత్యేక స్క్వాడ్ సీఐ శ్రీనివాసులు, ఇంటెలిజెన్స్ సీఐ నరసానాయుడు, సెబ్ అధికారి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

బుక్కరాయసముద్రం: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ సభ్యుడు భాస్కర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం రోజు రోజుకు కాలుష్యం పెరిగిపోతోందన్నారు. ప్రతి ఒక్కరూ రెండు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జగనన్న పచ్చదనం కింద హౌసింగ్ లే అవుట్లు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాలు చేపడుతోందన్నారు. కార్యక్ర మంలో ఎంపీడీఓ విజయభాస్కర్, ఈఓఆర్‌డీ దామోదరమ్మ, ఈసీ ప్రసాద్, ఏపీఓ పోలేరయ్య, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఘనంగా పెద్ద సరిగెత్తు



చందనలో పానకం దుత్తలతో ఊరేగింపుగా వెళ్తున్న ముజావర్లు



గుత్తి: అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న పగ్గాల పీర్లు

యాడికి: మండల కేంద్రంతో పాటు కోనుప్పలపాడు, నిట్టూరు, రాయలచెరువు, చందన, రామరాజుపల్లె, వేములపాడు, లక్ష్ముంపల్లె గ్రామాల్లో మొహర్రంలో భాగంగా శుక్రవారం పెద్ద సరిగెత్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. చందనలో మకాన్‌ను రంగురంగుల విద్యుద్దీపాలం కరలో అలంకరించారు. మకాన్‌లోని పీర్ల స్వాములను ముజావర్లు ఖాజా హుసేన్, చాంద్‌బాషా పెద్ద పీరు స్వామి, చిన్న పీరుస్వామి, బొడ్డుపీరు స్వాములతో పాటు మరో 10 పీర్ల స్వాములను ప్రత్యేకంగా అలంకరించారు. పీర్లమాల ధరించిన కుటుంబాలు తమ ఇళ్ల నుంచి పానకం దుత్తలను నెత్తిన పెట్టుకొని సాహుసేన్..సాహుసేన్ అంటూ మకాన్‌కు చేరుకొని పీర్ల స్వాముల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి పానకంను అగ్ని గుండంలో పోశారు. కోర్కెలు నెరవేరిన కొంతమంది భక్తులు, చిన్నారులు, దీర్ఘకాలిక రోగాలతో ఉన్న ప్రజలు మకాన్‌లో ఉన్న కాటా వద్ద తమ తూకంతో సమానంగా చక్కెర చదివింపులు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మరికొంత మంది వెండి గొడుగులు సమర్పించారు. ట్రాక్టర్లు, ఎడ్లబండ్లతో గ్రామస్తులు మకాన్ ఎదురుగా ఉన్న గుండంలోకి కట్టెలు, మొద్దులు వేసి వెలిగించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

నార్పల: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన గూగూడు కుళ్లాయిస్వామిని రాష్ట్ర నాటక అకాడమీ చైర్‌పర్సన్ రాగే హరిత, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్‌తో కలసి శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలోనే గూగూడు కుళ్లాయిస్వామి ఆలయం ఎంతో గొప్పదన్నారు.

శింగనమల: శింగనమలలోని మసూద్ గాజి దర్గాలో నున్న వెండి పీరుకు ఆరు తులాల బంగారు దండను గొర్రెల పెంపకందారులు అందజేశారు. ఈసందర్భంగా గొర్రెల పెంపకందారులు ఊరేగింపు నిర్వహించారు.

పామిడి: మండలవ్యాప్తంగా పీర్ల మకాన్లలోపెద్ద సరిగెత్తు కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. 9 ఖాన్‌ను పురస్కరించుకుని మకాన్లలోని పీర్లస్వాములను పూలు, గొడుగులు, సొత్తులు ధరింపజేసి శోభాయానంగా అలంకరించారు. ఈసందర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో పీర్ల స్వాములను దర్శించుకున్నారు. ముజావర్లు చక్కెర చదివింపులు చేసి పంచిపెట్టారు.

గుత్తి: మండల వ్యాప్తంగా మొహర్రంలో భాగంగా పెద్ద సరిగెత్తు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పట్టణంలో పగ్గాల పీర్లు, బొడ్డు పీర్లు, బారే హిమామ్ పీర్లు అగ్ని గుండ ప్రవేశం చేశాయి. కార్యక్రమాన్ని ప్రజలు ఎంతో ఆసక్తిగా తిలకించారు. పట్టణంలో ఎక్కడ చూసినా మొహర్రం సందడి కనిపించింది. ఇదిలా ఉండగా పట్టణంలోని బారే హిమామ్ పీర్లను మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ, వైస్ చైర్ పర్సన్ బిందె వరలక్ష్మి, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ పీరా, షఫి తదితరులు దర్శించుకున్నారు. ఈసందర్భంగా చక్కెర చదివించి మొక్కులు తీర్చుకున్నారు.



యాడికి :చందనలో అగ్ని గుండం నుంచి ఎగసిపడుతున్న మంటలు

ఎద్దుల తూకంతో చక్కెర చదివింపు

గుంతకల్లు రూరల్: కసాపురంలో శుక్రవారం గ్రామానికి చెందిన బెస్త సుధాకర్ అనే భక్తుడు తన రెండు ఎద్దుల తూకం చక్కెరను గూగూడు కుళ్లాయి పీర్ల స్వామికి చదివింపుల ద్వారా సమర్పించారు. తనకున్న రెండు ఎద్దుల్లో ఒకటి అనారోగ్యం బారిన పడింది. ఆ సమయంలో సుధాకర్ గ్రామంలోని గూగూడు కుళ్లాయి స్వామికి మొక్కుకున్నాడు. ఎద్దుకు ఆరోగ్యం చేకూరడంతో 550 కిలోల చక్కెరను సమర్పించారు.

దరఖాస్తుల ఆహ్వానం

గార్లదిన్నె: స్థానిక ముస్లిం మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో 5, 6, 7, 8 తరగతుల్లో మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మల్లికార్జుడు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మే నెలలో ఏపీ ఆర్‌ఎస్ క్యాట్ ప్రవేశ పరీక్ష రాసి సీటు రాని ఎస్సీ, ఎస్టీలు 5వ తరగతిలో ప్రవేశం కోసం ఈనెల 31 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే ముస్లిం ,మైనార్టీ విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాయకున్నా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పాఠశాలలో 5వ తరగతిలో ఎస్సీ -04, ఎస్టీ-1, 6వ తరగతిలో ఎస్టీ 1, 7వ తరగతిలో ఎస్సీ 2, మైనార్టీ 2, 8వ తరగతిలో ఎస్సీ 01, ఎస్టీ 1, మైనార్టీ 2 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

పాళ్యంలో వీధిదీపాల ఏర్పాటు

పామిడి: పాళ్యం గ్రామంలో మొహర్రంను పురస్కరించుకొని శుక్రవారం వీధి దీపాలు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి సూచన మేరకు సర్పంచ్ రామాంజనేయులు ఆధ్వర్యంలో విద్యుత్ స్తంభాలకు వైర్లు లాగి వీధిదీపాలు అమర్చారు.

కళాశాలల బంద్ విజయవంతం

తాడిపత్రి అర్బన్: ఏబీవీపీ ఆధ్వర్యంలో వివిధ డిమాండ్ల సాధన కోసం చేపట్టిన జూనియర్ కళాశాలల బంద్ విజయవంతమైంది. శుక్రవారం ఉదయం ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా విభాగం కన్వీనర్ అఖిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజు, కార్యదర్శి హరినారాయణ, నాయకులు సాయి కార్తీక్, మంజు, హర్ష, సుధీర్, నరసింహ, చరణ్ పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఏబీవీపీ నాయకులు పట్టణంలోని జూనియర్ కళాశాలలను బంద్ చేయించారు. కార్యక్రమంలో ఏబీవీపీ డివిజన్ కార్యదర్శి చిన్నశ్రీరామ్, పట్టణ కార్యదర్శి శివరాజ్,నాయకులు అక్రమ్, విజయ్, హర్ష, ముఖేష్ పాల్గొన్నారు.

కేజీబీవీలో సీటు ఇప్పించండి

రాప్తాడురూరల్: తాను డయాలసిస్ రోగినని, తన కూతురికి కేజీబీవీలో 8వ తరగతిలో ప్రవేశం కల్పించాలని గుత్తి మండలం బేతాపల్లికి చెందిన జి.సుధాకర్ అధికారులను కోరాడు. శుక్రవారం భార్య సుజాత, కూతురు అశ్వినితో కలిసి సమగ్ర శిక్ష కార్యాలయానికి వచ్చాడు. సమగ్ర శిక్ష ఏపీఓ, జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్, జీసీడీఓ వాణీదేవిని కలిసి సీటు ఇవ్వాలని అభ్యర్థించారు.

సమన్వయంతో పనిచేయండి



డీఆర్‌ఎంతో మాట్లాడుతున్న జీఆర్‌పీ ఎస్పీ, ఆర్‌పీఎఫ్ డివిజనల్ కమిషనర్

గుంతకల్లు: ప్రయాణికుల భద్రత, రైల్వే ఆస్తుల పరిరక్షణకు సమన్వయంతో పనిచేయాలని డీఆర్‌ఎం మనీష్ అగార్వాల్ అధికారులకు సూచించారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డీఆర్‌ఎంను జీఆర్‌పీ ఎస్పీ కే.చౌడేశ్వరి, ఆర్‌పీఎఫ్ డివిజనల్ కమిషనర్ మురళీకృష్ణ మార్యాదపూర్వకంగా కలిశారు. ఆయన పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాంకాంక్షలు తెలిపారు. అనంతరం డివిజన్ పరిధిలో నెలకొన్న రైల్వేపరమైన పలు సమస్యలపై చర్చించారు. ప్రయాణికుల భద్రత, రైల్వే ఆస్తుల పరిరక్షణకు అవసరమైన చర్యలకు అన్నివిధాల సహకరిస్తామని డీఆర్‌ఎం తెలిజేశారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కరించాలి

గుంతకల్లు: రైల్వే కాంటాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సీఐటీయూ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కసాపురం రమేష్, సాకే నాగరాజు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు వారి సర్వీసును 60 ఏళ్ల వరకు కొనసాగించాలన్నారు. టెండర్ అగ్రిమెంట్‌లో కాంట్రాక్టర్లు మారినా ఒప్పంద కార్మికులను తొలగించరాదని డిమాండ్ చేశారు. కనీస వేతనం కింద నెలకు రూ.26,000 చెల్లించడంతోపాటు ప్రతినెలా 5వ తేదీలోగా వారి ఖాతాల్లో జమ చేయాలని, ప్లే స్లిప్ అందజేయాలని విజ్ఞప్తి చేశారు. సీఐటీయూ నాయకులు షబ్బీర్, మల్లి, పెద్దన్న, మురళి, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రూపాయి ఖర్చు లేకుండా రీసర్వే



నక్కనదొడ్డికి చేరిన సర్వే హద్దు రాళ్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ రాము

గుంతకల్లు రూరల్: రైతులకు ఒక్క రూపాయి కూడా ఖర్చులేకుండా ప్రభుత్వం రీసర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తహసీల్దార్ రాము తెలిపారు. శుక్రవారం నక్కనదొడ్డి దర్గా వద్దకు చేరుకున్న సర్వే రాళ్లను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. భూమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. మండలంలోని 8 గ్రామాల్లో రీసర్వే పనులు ప్రారంభం కాగా ఇప్పటివరకూ సంగాల, దంచర్ల, నక్కనదొడ్డి, తిమ్మాపురం గ్రామాల్లో పూర్తియినట్లు తెలిపారు. రీసర్వే అనంతరం హద్దులు ఏర్పాటు చేసే క్రమంలో భాగంగా ప్రభుత్వమే రాళ్లను కూడా పంపిణీ చేసిందన్నారు. హద్దులను ఏర్పాటు చేసి త్వరలోనే పట్టాదారు పాస్ పుస్తకాలు కూడా పంపిణీ చేస్తామని తహసీల్దార్ వివరించారు.

అమరుల ఆశయాలను కొనసాగిస్తాం

గుంతకల్లుటౌన్: అమరవీరులు తరిమెల నాగిరెడ్డి, చారుమజుందార్, మధుసూదన్ యాదవ్ ఆశయ సాధనకు కృషి చేస్తామని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ పార్టీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్ తెలిపారు. శుక్రవారం స్థానిక న్యూడెమోక్రసీ కార్యాలయంలో అమరుల చిత్రపటాలకు నివాళులర్పించారు. సురేష్ మాట్లాడుతూ ఫ్యూడల్, వెట్టిచాకిరీ, భూస్వామ్య వ్యవస్థలకు వ్యతిరేకంగా పోరాడిన ఫలితంగా ప్రభుత్వం అనేక భూసంస్కరణలు తీసుకొచ్చిందన్నారు. పార్టీ పట్టణ కార్యదర్శి జి.చిన్నా, నాయకులు జిలాన్, దేవేంద్ర, షేక్షావలి, గోపి, నారాయణ పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

పెద్దవడుగూరు: మణిపూర్‌లో మహిళలపై అతికిరాతకంగా ప్రవర్తించిన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని సీపీఐ నాయకులు సూర్యనారాయణ రెడ్డి, వెంకటరాముడు యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కిష్టిపాడులోని గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ సీనియర్ నాయకులు సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ మణిపూర్‌లో రెండు నెలలుగా దారుణ మారణకాండ జరుగుతున్నా కేంద్రం పట్టించుకోకపోవడం దారుణమన్నారు.



స్టోర్‌ను తనిఖీ చేస్తున్న దృశ్యం

బేతాపల్లి చౌక దుకాణం తనిఖీ

గుత్తి: బేతాపల్లి గ్రామంలో ప్రభుత్వ చౌకధాన్యపు దుకాణాన్ని శుక్రవారం విజిలెన్స్, రెవెన్యూ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు ఈ పాస్ విలువ, భౌతిక విలువలకు మధ్య చాలా వ్యత్యాసం ఉన్నట్లు గ్రహించారు. స్టోర్ డీలర్ లక్ష్మిదేవిపై 6-ఏ సెక్షన్ కింద కేసు నమోదు చేయాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. దాడుల్లో ఆర్ఐ సూరి, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



మహిళకు సర్టిఫికెట్ అందిస్తున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రి అర్బన్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు, యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని 12,13 వార్డుల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. అర్హులందరికీ న్యాయం చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టారన్నారు. ఈకార్యక్రమం ద్వారా ప్రభుత్వం ఉచితంగా 11 రకాల సేవలను అందిస్తోందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల వద్దకు వెళ్లకుండానే వివిధ రకాల సర్టిఫికెట్లు ప్రభుత్వం అందిస్తోందన్నారు. అనంతరం లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. మున్సిపల్ కమీషనర్ జి.రవి, కౌన్సిలర్ రంగనాథ్‌రెడ్డి, నాయకుడు బాబయ్య, వార్డు సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు, గృహ సారథులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నార్పల: జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు రక్షణలాంటిదని వైఎస్సార్‌సీపీ నేత, అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని నార్పల-3, హెచ్.సోదనపల్లి సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సత్యనారాయణరెడ్డి, డీఎల్‌డీఓ ఓబులమ్మ, సర్పంచులు మన్నీల సుప్రియ, రాంభూపాల్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి 1183 మందికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఉప సర్పంచు గవ్వల శ్రీరాములు, ఎంపీటీసీ కాటమయ్య, బాలనాగి శీనా, చికెన్ గోపాల్, మన్నీల శివయ్య, పంచాయతీ కార్యదర్శులు అశ్వర్థనాయుడు, శ్రీనివాసులు, వీఆర్‌ఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ



దివ్యాంగులకు నిత్యావసర సరుకులను అందజేస్తున్న అధ్యక్షుడు చంద్రశేఖర్

తాడిపత్రి అర్బన్: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో శుక్రవారం వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా క్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి నెలా వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని అందులో భాగంగానే దివ్యాంగులకు నిత్యావసర సరుకులను అందజేయడం జరిగిందన్నారు. క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ భూమా సూర్యనారాయణ, శేషఫణీ, టిసిసి చైర్మన్ శివకుమార్, విపి మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా స్థానిక ప్రభుత్వాస్పత్రిలో గర్భిణులకు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో పాలు, బ్రెడ్రు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖర్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ కందుకూరి సుబ్బరామయ్య, డైరెక్టర్ అచ్యుతనాగేంద్ర, సంతోష్‌కుమార్, సుబ్బ రత్నమయ్య, నాగరాగిణి తదితరులు పాల్గొన్నారు.

అనాథ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



అనాథ పిల్లలకు పుస్తకాలను అందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

తాడిపత్రి అర్బన్: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక రమణ మహర్షి ఆశ్రమంలో శుక్రవారం అనాథ విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు రమేష్ బాబు మాట్లాడుతూ సామాజిక సేవ అందించడంలో రోటరీ క్లబ్ తనదైన ముద్రవేసుకుందన్నారు. రమణ మహర్షి ఆశ్రమ నిర్వాహకుడు వివి.బ్రహ్మం మాట్లాడుతూ రోటరీ క్లబ్ సేవలు ప్రశంసనీయమన్నారు. అనంతరం ఆశ్రమంలోని విద్యార్థులకు రూ.30 వేలు విలువ చేసే పుస్తకాలను అందజేశారు. క్లబ్ సెక్రటరీ పీవీ సుబ్రమణ్యం, సభ్యులు మద్దిలేటి, నాగేంద్ర, ఓబులేసు, మల్లారెడ్డి, శ్రీకాంత్, విక్రమ్, రఫీ, రంగనాయకులు, కుళ్లాయిస్వామి, మాదవ, షాకీర్‌బాషా పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ప్లాస్టిక్ దుకాణాలపై దాడులు

గుత్తి: పట్టణంలోని పలు ప్లాస్టిక్ విక్రయ దుకాణాలపై శుక్రవారం మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులను అంటే కవర్లు, ప్లేట్లు, గ్లాసులు వంటివి విక్రయిస్తున్న ఐదుగురు వ్యాపారులకు జరిమానా విధించారు. దాడుల్లో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగయ్య, హెల్త్ అసిస్టెంట్ వనజ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

తాడిపత్రి: విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ వీరాంజినేయులు శుక్రవారం తెలిపారు. కడప రోడ్డు, యల్లనూరు రోడ్డు, నంద్యాల రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని, ప్రజలు గమనించాలని కోరారు.

పేద గర్భిణికి ఆర్థికసాయం



నగదు అందిస్తున్న నాయకులు

గుత్తి: పట్టణానికి చెందిన ఓ గర్భిణికి శుక్రవారం గుత్తి బలిజ సంఘం సభ్యులు ఆర్థిక సాయం అందజేశారు. వివరాల్లోకి వెళితే.. సీపీఐ కాలనీకి చెందిన మారుతి భార్య లక్ష్మి శుక్రవారం పురిటి నొప్పులతో పట్టణంలోని మాతృశ్రీ ఆస్పత్రిలో చేరింది. వారి ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న బలిజ సంఘం సభ్యులు చందాలు సేకరించి రూ.23,100 నగదు లక్ష్మి భర్త మారుతికి అందజేశారు. సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు మారాకుల రమణ, శ్రీకరం గోవిందరాజులు, కార్యదర్శులు, సహాయ కార్యదర్శులు పగడాల శ్రీనివాసులు, శ్రీకరం వెంకటేష్, మంజు, సభ్యులు రఘు, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా ఓటరు జాబితా

శింగనమల: ఓటరు జాబితాను తప్పులు లేకుండా రూపొందించాలని తహసీల్దార్ ఈశ్వరమ్మ పేర్కొన్నారు. గోవిందరాయునిపేట, శివపురం, సోదనపల్లిలో ఓటరు జాబితా ఇంటింటి సర్వేను పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఆగస్టు నెల 21 వరకు బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటరు సర్వే చేయాలన్నారు. బోగస్ ఓట్లు, మృతి చెందిన వారి పేర్లు గుర్తించాలన్నారు. సర్వే సమయంలో రాజకీయ పార్టీల ఏజెంట్లు , బీఎల్‌ఓలతో సహకరించాలన్నారు. ఈడీటీ రామకృష్ణ ఉన్నారు.

మట్టి తరలిస్తున్న వాహనాల సీజ్

గార్లదిన్నె: కోటంక గుట్ట నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు టిప్పర్లు, జేసీబీని సీజ్ చేసినట్లు గనులు, భూగర్భ శాఖ అధికారి విజయలక్ష్మి పేర్కొన్నారు. శనివారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ కోటంకలో గుట్ట నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. సంఘటన స్థలానికి వెళ్లి మట్టి తరలిస్తున్న రెండు టిప్పర్లు, ఒక జేసీబీ సీజ్ చేసి గార్లదిన్నె పోలీస్‌స్టేషన్‌కు అప్పగించామన్నారు.